క్లుప్తంగా

ఆర్వోబీపై మరమ్మతులు
● స్పందించి పరిశీలించిన ఎమ్మెల్యే



కాజీపేట అర్బన్: కడిపికొండ ఆర్వోబీ దుస్థితిపై ఈనెల 13వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించి రెండు రోజుల క్రితం బ్రిడ్జిని పరిశీలించారు. గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులకు సూచించగా, ఆర్వోబీపై ఏర్పడిన గుంతలను డాంబర్‌తో శనివారం పూడ్చారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆటోలో సూట్‌కేస్ పోగొట్టుకున్న వ్యక్తి ఎవరో తెలియకపోవడంతో ఆ సూట్‌కేసును హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సతీష్‌కు ఓ ఆటో డ్రైవర్ అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి తగిన ఆధారాలు చూపెట్టి సూట్‌కేసు తీసుకెళ్లాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



కాజీపేట: శనివారం సంగారెడ్డి పట్టణంలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో నాయకులు శనివారం ఆవిష్కరించారు. సభలను విజయవంతం చేయాలని కోరుతూ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు వాల్‌పోస్టర్లను విడుదల చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జంపాల రమేష్, తొట్టె మల్లేశం, సంటి రవి, ఇందిర, అనిత, యాదగిరి, సిద్దులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో వినయ్‌భాస్కర్ దంపతులు



హన్మకొండ: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, రేవతి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

టీపీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: టీపీఆర్‌టీయూ నూతన సంవత్సర డైరీని హనుమకొండ తన కార్యాలయంలో డీఈఓ వాసంతి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె చంద్రయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కురుమ పున్నంచందర్, ప్రధాన కార్యదర్శి రావు రమేష్, ఉపాధ్యాయులు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ క్రీడలు ప్రారంభం



హసనపర్తి: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఇరిగేషన్ ఈఈ నారాయణ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి పారుదల శాఖ నర్సంపేట, భూపాలపల్లి, ఏటూరునాగారం డివిజన్ పరిధిలోని ఉద్యోగుల క్రీడాపోటీలు నగరంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా నీటిపారుదల శాఖ ఈఈ నారాయణ పాల్గొని మాట్లాడుతూ వృత్తిరీత్యా తీరికలేకుండా ఉండే ఉద్యోగులకు ఈ పోటీలు మానసిక వికాసానికి దోహదపడుతాయని అన్నారు. డీఈఈలు ప్రసాద్, గోకారపు శరత్‌బాబు, రవికుమార్, యశ్వంత్, గిరిధర్, రమేష్, ఏఈలు భాస్కర్, ప్రణీత్, డీఓ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఏపీ మాజీ సీఎం నందమూరి తారకరామారావు వర్ధంతిని నగర వ్యాప్తంగా శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేదలు, తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారని ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు కొనియాడారు.

\- సాక్షి నెట్‌వర్క్

పొగరాజేస్తున్న డంపింగ్ యార్డు

- విలీన గ్రామాలను కమ్మేస్తున్న పొగ
- డంపింగ్ యార్డు ఎత్తివేస్తామని అసెంబ్లీ ఎన్నికల బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి హామీ
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- అనారోగ్యం బారిన పడుతున్న స్థానికులు



మడికొండపై అలుముకున్న డంపింగ్ యార్డు పొగ



డంపింగ్ యార్డులో గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త

మడికొండ: మడికొండ శివారులోని డంపింగ్ యార్డులో నుంచి వచ్చే పొగ సాయంత్రం అయిందంటే కాజీపేట మండలంలోని రాంపూర్, మడికొండ, డీజిల్‌కాలనీ, అయోధ్యపురం, ధర్మసాగర్ మండల కేంద్రంతో పాటు నర్సింగరావు పల్లి, తదితర గ్రామాలకు వ్యాపిస్తోంది. ఈక్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడికొండలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేముందు వద్దని ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోకుండా ఏర్పాటు చేశారని వాపోతున్నారు. చలికాలంలో అయితే ప్రతిరోజూ సాయంత్రం, రాత్రి వేళల్లో పొగ వ్యాపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఈక్రమంలో పొగతో శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు.

అమలుకు నోచుకోని రేవంత్‌రెడ్డి హామీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా డంపింగ్ యార్డును మడికొండలో నుంచి తొలగిస్తామని ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు సంవత్సరం గడిచినా డంపింగ్ యార్డు తరలింపులో పురోగతి లేదు. చెత్త రీసైక్లింగ్ కోసం జపాన్‌కు చెందిన ఆస్కి సంస్థతో రూ.17 కోట్ల వ్యయంతో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రోజురోజుకు యార్డులో చెత్తాచెదారం, వ్యర్థాలు గుట్టలుగా పెరిగిపోతున్నాయి. అక్కడ కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కాగా, ఆయా గ్రామస్తులు డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి ఆదివారం సమావేశమై పలు నిర్ణయాలు తీసుకోనున్నారు. ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగనున్నారు.

అనారోగ్యం బారిన పడుతున్నాం



డంపింగ్ యార్డు పొగతో గ్రామంలోని ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. సాయంత్రం అయిందంటే పొగ గ్రామాన్ని పూర్తిగా కమ్మేస్తోంది. సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అలాగే, డంపింగ్ యార్డు వ్యర్థాల నుంచి వచ్చే మురుగునీరు మడికొండ పెద్ద చెరువులోకి వస్తోంది. దాంతో చెరువులోని చేపలు చనిపోతున్నాయి.

\- నర్ర చంద్రమౌళి ముదిరాజ్, మడికొండ

పొగతో తీవ్రంగా నష్టపోతున్నాం



డంపింగ్ యార్డు పొగతో కొన్నేళ్లుగా గీత కార్మికులమంతా తీవ్రంగా నష్టపోతున్నాం. పొగ కారణంగా తాటి, ఈత కల్లు సరిగా కావడంలేదు. దాంతో ఈ వృత్తినే నమ్ముకున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డును మడికొండ నుంచి ఇతర చోటుకు తరలించాలి.

\- కొత్తకొండ వెంకటేశ్వర్లు గౌడ్, మడికొండ

ఆటో కార్మికుల హక్కుల సాధనకు పోరాడుదాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

హన్మకొండ: ఆటో కార్మికుల హక్కుల సాధనకు పోరాడుదామని త్రిచక్ర సొసైటీ అధ్యక్షుడు ఈసంపల్లి సంజీవ, కో ఆర్డినేటర్ నేరెళ్ల రవీందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో త్రిచక్ర సహకార సంఘం నాలుగో మహాసభ పోస్టర్, కరపత్రాలను సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజీవ, రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులకు త్రిచక్ర పొదుపు, పరపతి పరస్పర సహాయ సహకార సంఘం అండగా నిలుస్తోందని, నాలుగేళ్లలో రూ.3.50 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈనెల 19న హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సంఘం మహాజన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. టీఎస్ అపెక్స్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, గాయత్రి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ముత్యాల లక్ష్మణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి చీకటి కుమార్, డైరెక్టర్లు కలకోట్ల జయరాం, బొల్లం సంజీవ, రమేష్, సభ్యులు రవీందర్, చక్రపాణి, గణేష్, దేవేందర్, సంజీవ, ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: పదో తరగతి విద్యార్థుల ఉపయోగార్థం ఇంగ్లిష్ సబ్జెక్ట్‌కు సంబంధించిన ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్ (పాస్‌ఐ -పాస్)ను హనుమకొండలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ వాసంతి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌లోని ప్రాక్టీస్ పేపర్లను ఉపాధ్యాయులు కూడా ఉపయోగించుకొని ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐఈడీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎల్టా హనుమకొండ జిల్లా బాధ్యులు డాక్టర్ కోల రవికుమార్, కొక్కుల సంపత్‌కుమార్, పందిరి వాసు, సుమన, కాంతయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమన జయంతి

హన్మకొండ చౌరస్తా / హన్మకొండ : వేమన భగవాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 19వ తేదీన హనుమకొండలోని టీఎన్జీఓఎస్ ఫేజ్ -2 కాలనీలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, జమ్మికుంట అధ్యక్షుడు వెంకటాచార్యులు తెలిపారు. ఈమేరకు వేమన భగవాన్ జయంతి ఉత్సవాలకు రావాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డిని శనివారం వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. రాధిక, శశికాంత్, దివ్య, రాజు, భార్గవి, రాజలింగం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా

హన్మకొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. హనుమకొండలోని స్నేహనగర్‌లో ఆమె శనివారం పర్యటించారు. వరంగల్ మహానగర పాలక సంస్థ ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో కలిసి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని స్థానికులు కోరారు. అనంతరం కాలనీ వాసులతో ఆమె సమావేశమై మాట్లాడారు. సమస్యలను మేయర్, కమిషనర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మహేందర్ రెడ్డి, స్నేహనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహారావు, సభ్యులు వెంకట రమణారావు, శశికాంత్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, రామిరెడ్డి, కిషన్ రావు, జానీపాషా, దీపక్‌రెడ్డి, హిదయతులా పాల్గొన్నారు.



స్నేహనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వసంత

మహాసభకు జర్నలిస్టులు తరలిరావాలి



నయీంనగర్: మాట్లాడుతున్న సురేందర్

హన్మకొండ: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల మహాసభకు మాదిగ జర్నలిస్టులు తరలిరావాలని కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్ట హరిత హోటల్‌లో వరంగల్ మాదిగ జర్నలిస్టుల సంఘం సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ఈనెల 20న హనుమకొండలో జరగనున్న లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల సన్నాహక మహాప్రదర్శన విజయవంతం చేయాలని కోరారు. మాదిగ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు బొక్క దయాసాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న, రచయిత బైరాగి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నయీంనగర్: హనుమకొండలో మినీ ప్రదర్శన సోమవారం నిర్వహించనున్నట్లు నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ తెలిపారు. వేయి స్తంభాల గుడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమంలో సుకుమార్, సూరన్న, బొడ్డు దయాకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోకి దొంగలొస్తున్నారు.. జాగ్రత్త!

హసన్‌పర్తి: గ్రామాల్లోకి దొంగలొస్తున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈమేరకు హసన్‌పర్తి బస్టాండ్‌లో ప్రయాణికులకు శనివారం అవగాహన కల్పించారు. తాళాలు వేసిఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇల్లు విడిచి బయటికి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కాలనీలతో పాటు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కార్యక్రమంలో ఏఎస్సై జనార్దన్, సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ రాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే, హసన్‌పర్తిలోని ఇందిర కాలనీలోని ఓ ఇంటిలో ఓ యువకుడు దూరాడు. పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తపేటలో అదనపు కలెక్టర్ తనిఖీ



రైతు భరోసా సర్వేను పరిశీలిస్తున్న సంధ్యారాణి

వరంగల్: వరంగల్ మండలం కొత్తపేట గ్రామంలో రైతు భరోసా కార్యక్రమాన్ని వరంగల్ అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పట్టాదారు పాసుబుక్‌లు కలిగిన ప్రతీఒక్కరికి రైతు భరోసాను వర్తింపజేశారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు పండించే పంట పొలాలకు మాత్రమే రైతు భరోసా వర్తించేలా నిబంధనలు రూపొందించినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలని సర్వే బృందాన్ని ఆదేశించారు. తనిఖీల్లో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, మండల వ్యవసాధికారులు, ఆర్‌ఐలు, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం

హన్మకొండ: హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈ.వీ.శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఔషధ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మామునూరు: విశ్వమానవ శ్రేయస్సు కోసం ఔషధ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ రామకిషన్, కేయు వీసీ ప్రతాప్‌రెడ్డి, వాగ్దేవి విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ సీహెచ్.దేవేందర్‌రెడ్డి సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో డాక్టర్ సీహెచ్.వాహిని, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జి.కమల్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను అభివృద్ధికి వినియోగించుకుని సమాజ హితానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఫార్మసీ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కిషన్, డాక్టర్ రాధాకిషన్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: ఈ ఏడాది ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న హనుమకొండలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ కోరారు. కేయూలోని పరిపాలన భవనం వద్ద విద్యార్థులతో కలిసి మహాసభల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో విద్యారంగ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయడం లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడం లేదని వాపోయారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు పరిమళ, బాధ్యులు గణేష్, విజయ్, వివేక్, పృథ్వీరాజ్, కల్యాణ్, సందీప్, ప్రదీప్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

21న కేయూలో అంతర్జాతీయ వర్క్‌షాప్



వర్క్‌షాప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

కేయూ క్యాంపస్: ఈనెల 21న కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఒకరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ తెలిపారు. ఈమేరకు వర్క్‌షాప్ వాల్‌పోస్టర్లను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం ఆవిష్కరించారు. డ్రగ్ డిస్కవరీ ఇన్నోవేషన్స్ అండ్ డెవలప్‌మెంట్ (డీడీఐడీ -2025) అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రసాద్ వివరించారు. వర్క్‌షాప్‌లో ప్రవాస భారతీయుడు డాక్టర్ డి.సాంబరెడ్డి కీలకోపన్యాసం చేస్తారని, డాక్టర్ ఎంఎస్.రెడ్డి, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రామకిషన్, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రాంధన్, హైదరాబాద్ క్లినికల్ ఓవర్సీస్ అండ్ క్లీన్ ఫార్మెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ మహేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, బీఓఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ కృష్ణవేణి, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ షాయెద, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం



క్రీడాకారులతో మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: నిత్యం ఉద్యోగ, పదవీ బాధ్యతల్లో బిజీగా ఉండే అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లకు క్రీడలు మానసిక ఉల్లాసం, ఉత్సాహం కలిగిస్తాయని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బల్దియా ఆధ్వర్యంలో 2వ డివిజన్ రెడ్డిపురంలోని టీవీఎస్‌ఎస్ మైదానంలో అధికారులు, ఉద్యోగుల క్రీడలను శనివారం బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బల్దియా తరఫున వివిధ క్రీడాంశాల్లో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు క్రికెట్, చెస్, బ్యాడ్మింటన్‌తో పాటు ఇండోర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, పీఆర్‌ఓ అయూబ్ అలీ, డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

క్విజ్‌పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో ప్రిన్సిపాల్ రాజారెడ్డి, అధ్యాపకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు శనివారం క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానానికి ఎదగవచ్చని అన్నారు. హసన్‌పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి కింద రూ.వేయి, ఎల్కతుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు ద్వితీయ బహుమతి రూ.800, వరంగల్‌లోని కృష్ణకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినుల తృతీయ బహుమతి రూ.600 అందజేసినట్లు నిర్వాహకులు వివరించారు. తెలుగు విభాగం అధిపతి డాక్టర్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, అధ్యాపకులు డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ శివనాగ శ్రీను, సమత, రమేష్, మహేందర్, సీతారాములు, శ్రీనివాస్, గాయత్రిదేవి, కోమల, విజయలక్ష్మి, సమ్మయ్య, వెంకటరమణ, కిశోర్, నర్సింహులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషిచేయాలి

న్యూశాయంపేట: లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు కృషిచేయాలని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంగల్‌రెడ్డి సూచించారు. హనుమకొండ సీపీఐ కార్యాలయంలో జిల్లా పార్టీ కార్యదర్శి కే.భిక్షపతి అధ్యక్షతన శనివారం జరిగిన ప్రజాసంఘాల నిరంతర రాజకీయ అధ్యయన తరగతుల్లో ముఖ్యఅతిథిగా వెంగల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశంలో మతతత్వ హిందూ రాజ్యాన్ని స్థాపించడం కోసం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేపడుతున్న విధానాలను వ్యతిరేకించాలన్నారు. కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీల పేరిట ఆర్థిక వ్యవస్థను కట్టబెట్టడం కేంద్రం దుందుడుకు చర్యలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య ముసుగులో కార్పొరేట్ సంస్థల కనుసన్నల్లో రాజకీయాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఏ దేశంలో లేనివిధంగా జీఎస్టీని తమ దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ టి.భిక్షపతి, ఎల్లేశ్, లక్ష్మణ్, సంతోష్, శ్రీనివాస్, రాజు, సదానందం, సారంగపాణి, దీన, శంకర్‌నాయక్, రాజయ్య, రాములు, వెంకటేష్, రమాదేవి, రాజేందర్, రాంమూర్తి, వెంకట్రాజం, మనోహర్, రత్నం పాల్గొన్నారు.

ప్రొఫెసర్ భూక్య బాబురావుకు సన్మానం



హన్మకొండ కల్చరల్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావును పీఠం సిబ్బంది సన్మానించారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో ఎంఏ రెగ్యులర్ తెలుగు కోర్సు ప్రవేశపెట్టడంలో కృషి చేసిన బాబురావు.. పీఠాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తైన సందర్భంగా సిబ్బంది శనివారం అభినందనలు తెలిపారు. అలాగే, హిస్టరీ టూరిజం అండ్ కల్చర్ కోర్సును కూడా ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఠం సిబ్బంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, పరావస్తు విజయలక్ష్మి, సిద్దోజు సునంద, ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో మున్సిపల్ కార్మికుల నిరసన



కాజీపేట: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులు రీప్లేస్‌మెంట్ కమిటీలతో సంబంధం లేకుండా ఎప్పుడంటే అప్పుడు పనిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ మండల అధ్యక్షుడు రొంటాల కోటేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ హాజరు పాయింట్ వద్ద కార్మికులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఆర్.రమణారెడ్డి కోరారు. ఈమేరకు డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో శనివారం కలిసి విన్నవించారు. విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌తో పాటు పలు సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు శశికుమార్ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

హసన్‌పర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల ఇంటింటి సర్వే కొనసాగుతోంది. జాబితాలోని దరఖాస్తుదారుల ఇళ్లవద్దకు సర్వే బృందం వెళ్లి వారి వివరాలు నమోదు చేస్తోంది. అయితే, దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ పేర్లు జాబితాల్లో లేకపోవడంపై అర్జీదారులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని సర్వే అధికారులు చెబుతున్నారు. సంక్షేమ పథకాలకు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వార్డు అధికారి కళ్యాణి, బృందం సభ్యులు రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ కరపత్రం ఆవిష్కరణ

ఖిలా వరంగల్: ఈనెల 19న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం జరగనుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు తెలిపారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమర కోట జంక్షన్‌లో కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇనుముల కృష్ణ, ఏలియా, అశోక్, దశరథం, రాముడు, రామ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నారం దర్గాలో సీపీ మొక్కులు

పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా శనివారం హాజరయ్యారు. అన్నారం యాకూబ్ షావలి దర్గాను సందర్శించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా సీపీకి మత పెద్దలు స్వాగతం పలికారు. ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. ఆయన వెంట మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్, మేజెవార్ పాషా, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఐదు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

మడికొండ: అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మడికొండ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కరీమాబాద్‌కు చెందిన కనుకుంట్ల రాజుపై కేసు నమోదు చేసినట్లు కానిస్టేబుళ్లు రాజు, నాగేశ్వర్, గోవర్ధన్ తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు స్థానికులు సహకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కర్ణాకర్‌రెడ్డి కోరారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన కర్ణాకర్‌రెడ్డిని కార్పొరేటర్ శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.